ప్రజాశక్తి

సోమవారం 3 జూన్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా





డ్రైనేజీల్లో ఉన్న వాటర్ పైపులైన్లు

కలుషిత నీరే దిక్కు

- నామమాత్రంగా క్లోరినేషన్
- దెబ్బతిన్న ఫిల్టర్ బెడ్లు...

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలో కలుషిత నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా నగరపాలక సంస్థ అందించే తాగునీరు దుర్వాసనతో, మడ్డి అయిల్ రంగులో వస్తోంది. స్థానికులు ఫిర్యాదు చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నీటినే తాగడంతో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. వందల సంఖ్యలో ఆస్పత్రుల పాలవుతున్నారు. మృత్యు ఘోషతో నగర ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నా... ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా... నగర కమిషనర్ అత్యంత బాధ్యతారాహిత్యంగా, సంఘటలను తప్పుదారి పట్టించే రీతిలో మాట్లాడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులతోపాటు పౌర వేదికలు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజయవాడ నగరంలో 243 కిలోమీటర్ల పొడవున మంచినీటి పైప్‌లైన్లు ఉన్నాయి. నగరంలో మెయిన్, ట్రంక్ లైన్లు మినహాయిస్తే... అంతర్గత (మిగతా 2లో)

ఆగని అతిసార



వాటర్ ప్లాంట్ నుంచి నీరు తెస్తున్న చిన్నారులు

- విజయవాడలో పెరుగుతున్న బాధితులు
- మరో ఆరుగురికి లక్షణాలు
- కమిషనర్ వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడలో అతిసార బాధితులు పెరుగుతూనే ఉన్నారు. ఆదివారం కూడా మొగల్రాజపురం పరిసర ప్రాంతాలకు చెందిన ఆరుగురు అతిసార బారినపడ్డారు. అందులో నలుగురు స్వల్ప లక్షణాలతో మందులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. మొగల్రాజపురం ఆర్‌సిఎం చర్చి వెనుక నివాసముంటున్న బండి ఆనంద్‌తో పాటు మరొకరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతిసార వ్యాధితో బాధపడుతూ గత నాలుగు రోజుల నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొగల్రాజపురంనకు చెందిన సువర్ణ ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. నగరంలో పలు వైద్యశాలల్లో పలువురు అతిసార బాధితులు చికిత్స పొందుతూనే ఉన్నారు. సిపిఎం కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం కొనసాగుతుంది. పాయకాపురం, కండ్రిక, ప్రజాశక్తి నగర్ తదితర (మిగతా 2లో)

కౌంటింగ్‌కు సిద్ధం



- కృష్ణాలో ఒకటి, ఎన్‌టిఆర్ జిల్లాలో రెండు కేంద్రాలు
- మరో 24 గంటల్లో తేలనున్న భవితవ్యం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన కౌంటింగ్ ఈ నెల 4వ తేదీ మంగళవారం జరగనుంది. కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్శిటీలో నిర్వహించనున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంటు, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్‌ను ఇబ్రహీంపట్నంలోని నిమ్రా, నోవా కళాశాలల్లో నిర్వహించనున్నారు. మూడు కేంద్రాల్లోనూ ఓట్ల కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచల భద్రత కల్పించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులు సిబ్బందికి భోజనం, మౌలిక వసతులతో పాటు తాగునీరు, వైద్య సౌకర్యం అందుబాటులో ఉంచుతారు. కౌంటింగ్ సిబ్బంది, మంగళవారం ఉదయం నాలుగున్నర గంటలకు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. వివిధ అభ్యరుల తరుపున ఎన్నికల పోలింగ్‌ను పర్యవేక్షించే ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

మచిలీపట్నంలో ఇలా

మచిలీపట్నం పార్లమెంట్ దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,93,935 ఓట్లు పోలయ్యాయి. ఒక్కొక్క సెగ్మెంటుకు 14 టేబుళ్ళను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్లు కౌంటింగ్ జరగనుంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవిఎం)లలో పోలైన ఓట్లను రౌండ్లు వారీగా లెక్కిస్తారు. ప్రతి టేబుల్‌కు ఒక అదనపు ఏఆర్‌ఓ, ఒక కౌంటింగ్ అబ్జర్వర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించారు. మచిలీపట్నం అసెంబ్లీ స్థానానికి 15, పెడనకు 16, గుడివాడ 17, పామర్రు 17, అవనిగడ్డ 20, గన్నవరం 22, పెనమలూరు 22 రౌండ్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించనున్నారు

24 గంటల్లో తేలనున్న భవితవ్యం

సార్వత్రిక ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలో గత ఎన్నికలకన్నా ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. 2019లో 84.36 శాతం ఓట్లు పోలవ్వగా, ఈ ఎన్నికల్లో 84.45 శాతం పోలయ్యాయి. ఫలితాలకై సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్నారు. గెలుపుపై ఎవరి అంచనాల్లో వారున్నారు. ఈ నేపథ్యంలో మరో 24 గంటల్లో వారి భవితవ్యం తేలనుంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	అభ్యర్థులు	రౌండ్లు
మచిలీపట్నం	202	14	15
పెడన	216	10	16
గుడివాడ	230	12	17
పామర్రు	238	08	17
అవనిగడ్డ	267	12	20
గన్నవరం	306	12	22
పెనమలూరు	304	11	22
తిరువూరు	234	13	17
విజయవాడ పశ్చిమ	253	17	19
విజయవాడ సెంట్రల్	267	22	20
విజయవాడ తూర్పు	298	17	22
మైలవరం	296	12	22



వార్త 2లో

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు కట్టుదిట్టం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు కట్టుదిట్టం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లాలో పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేసినట్లే చివరి కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సర్వసన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా కళాశాలలో తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, నందిగామ నియోజకవర్గాలకు నిమ్రా కళాశాలలో, విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎం కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈవీఎం కౌంటింగ్ (పార్లమెంటరీ నియోజకవర్గం)కు ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం కౌంటింగ్‌కు టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 17,596 పోస్టల్ బ్యాలెట్లతో పాటు ఇప్పటివరకు 153 ఈటీపీబీఎస్ ఓట్లు వచ్చినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి లెక్కింపును రెండు రౌండ్లలో పూర్తిచేసేందుకు సన్నద్ధంగా ఉన్నామని.. ఒక్కో రౌండ్‌కు దాదాపు 3 గంటల సమయం పడుతుందన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు కచ్చితమైన ప్రణాళికతో స్క్రుటినీ నిర్వహించి, ఓట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కచ్చితమైన ప్రణాళికతో మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఫారం-21సీ డిక్లరేషన్ వంటి వాటితో సహా సాయంత్రం ఆరు గంటలకల్లా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

పార్కింగ్‌తో పాటు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బందిని ఉదయం ఆరు గంటలకల్లా చేర్చేందుకు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంతో పాటు కేతనకొండ, కొండపల్లి, ఇబ్రహీంపట్నం సర్కిల్ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కింగ్‌కు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నోవా, నిమ్రా కళాశాలలతో పాటు జాతీయ రహదారి పాయింట్ వద్ద పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆర్‌వోలు, అబ్జర్వర్లు, ఈటీపీబీఎస్ ఓటీపీ వచ్చే ఫోన్లకు మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఎంట్రీ పాయింట్ ఉంటుందని.. వీరి మొబైళ్ల ఫోన్లకు మీడియా సెంటర్ వరకు అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ స్టాఫ్, కౌంటింగ్ ఏజెంట్లు తదితరుల మొబైళ్లకు అనుమతి లేనందున వారి ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తాగునీరు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హైస్పీడ్ ఇంటర్నెట్, టీవీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు తదితరాలతో నిమ్రా, నోవా కళాశాలల్లో మీడియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపును వేగంతో కచ్చితత్వంతో నిర్వహించి.. రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సూచిక బోర్డుల ఏర్పాట్లు, గుర్తింపు కార్డుల జారీ, అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

ఎన్‌టిఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డిఆర్ఓ వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా, నిమ్రా కళాశాలల్లో కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లతో పాటు ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. పార్కింగ్, భద్రత, సెల్‌ఫోన్ కలెక్షన్ల పాయింట్లు, సీసీ కెమెరాల నిఘా తదితరాలకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సూక్ష్మ పరిశీలన, సీసీ కెమెరాల నిఘా మధ్య ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సరైన విధంగా బ్యారికేడింగ్ చేయడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మీడియా కేంద్రం ద్వారా రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు తదితరాలు మీడియా సెంటర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అల్పాహారం, భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

కలుషిత నీరే దిక్కు

బ్రాంచ్ లైన్లు దాదాపుగా డ్రెయినేజిలో నుంచే పోతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన ఐరన్ మంచినీటి పైపులైన్లు ఎక్కడికక్కడ పగిలిపోయాయి. దీంతో, డ్రెయినేజీ వాటర్ కలిసి నీరు మొత్తం కలుషితం అవుతుంది. తూర్పు నియోజకవర్గంలోని పకీర్‌గూడెం ఏరియా నుంచి కలుషితమైన బోర్ వాటర్‌ను మోటార్ల ద్వారా పంపింగ్ చేసి మొగల్రాజపురంలోని ఆరు, ఏడు, ఎనిమిది డివిజన్లతోపాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడంతో ఆ నీటిని తాగి వాంతులు, విరోచనాలతో డయేరియా బారిన పడుతున్నారు. మరణాలు నమోదవుతున్నాయి. సింగ్‌నగర్ పాయకాపురం, కండ్రిక, రాధానగర్, ప్రజాశక్తి నగర్, వన్‌టౌన్‌లోని గొల్లపాలెంగట్టు (50వ డివిజన్), చిట్టినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, కృష్ణలంక 22వ డివిజన్‌లోని భ్రమరాంభపురం, ఆయిల్ కోట్టు, కోతమిషన్ రోడ్డు, బాపనయ్యనగర్, రామలింగేశ్వర్‌నగర్, వన్‌టౌన్, టూటౌన్, త్రి టౌన్ ప్రతి ఏరియాలోనూ కలుషిత నీరే గతన్నట్లుగా ఉంది. అతిసారాతో విజయవాడలోని మొగల్‌రాజపురం, కండ్రిక ప్రాంతాల్లో తొమ్మిది మంది మృతి చెందగా, వందల మంది ఆయా ప్రాంతాల్లోని ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం మొగల్రాజపురంలోని చంద్రరాజేశ్వరరావునగర్, సింగ్‌నగర్ పాయకాపురం, రాధానగర్, ప్రజాశక్తి నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు మృత్యువాత పడుతుండగా, మిగిలిన ఏరియాల్లోని ప్రజలు డయేరియా బారినపడుతున్నారు.

పడిపోయిన ప్రకాశం బ్యారేజి నీటి మట్టం

గతంలో ఎన్నడూ లేని రీతిలో విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద 12 అడుగుల నుంచి 8.5 అడుగులకు నీటి మట్టం పడిపోయింది. హెడ్ వాటర్ వర్క్స్ (ఇంటెక్ వెల్స్) వద్ద నీటిని శుద్ధి చేసేందుకు రూ.58 కోట్లకుపైగా నగరపాలక సంస్థ ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నా... పూర్తి స్థాయిలో నీటి క్లోరినేషన్ జరగడం లేదు. ప్రజలకు నీటిని సరఫరా చేసే హెడ్ వాటర్క్స్‌లోని 8 ఎంజిడి (మిలియన్ గ్యాలన్ల ఫర్ డే), 11 ఎంజిడి, 16 ఎంజిడి ప్లాంట్స్‌లోని ఫిల్టర్ బెడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీని ద్వారా నీరు ఫిల్టరేషన్ పూర్తి స్థాయిలో జరగడం లేదు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నదిలో నుంచి ఇన్‌టెక్‌వెల్స్ ద్వారా 65 మిలియన్ గ్యాలన్ల నీటిని విడుదల చేయాల్సి ఉండగా... 38 మిలియన్ గ్యాలన్ల నీరు మాత్రమే ఆయా ప్లాంట్లకు విడుదలవుతుంది. నాడు వామపక్షాల పాలనలో నిర్మించిన 11 రిజర్వాయర్ల నిర్వహణ ప్రస్తుతం అస్తవ్యస్తంగా తయారైంది. నగర వ్యాప్తంగా ఉన్న 72 ఓవర్‌హెడ్ ట్యాంకును నాలుగు నెలలకు కూడా శుభ్రం చేయడంలేదు. హెడ్ వాటర్ వర్క్స్, ఫిల్టర్ బెడ్లు, ఇతర రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణ అన్నింటినీ బాగు చేసి, రన్నింగ్‌లో ఉంచడానికి 350 మంది టెక్నీషియన్స్, ఆపరేటర్లు, ఇతర సిబ్బంది అవసరం కాగా, కేవలం 150 మంది సిబ్బంది మాత్రమే పని చేస్తుండడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. బోర్ వాటర్ పంపింగ్ చేసి, నీటిని క్లోరినేషన్ చేయడానికి (క్లోరిన్-ఆలం కలిపేందుకు) 12 డోజర్లు ఎప్పుడో కొనుగోలు చేయాల్సి ఉన్నా... కేవలం నాలుగు డోజర్లు మాత్రమే కొనుగోలు చేశారు. దీనివల్ల ఆయా ప్లాంట్స్‌లో క్లోరినేషన్ చేయకుండానే బోర్ వాటర్‌ను యధావిధిగా విడుదల చేస్తున్నారు.

డయేరియా బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

డయేరియాతో జనం పిట్టల్లా రాలిపోతున్నా నగర మేయర్, నగర కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లలో ఎటువంటి చలనం లేకుండా పోయిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ విమర్శించారు. డయేరియా బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోకుంటే



ఈ నెల 6వ తేదీ తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విజయవాడలోని శ్రీశ్రీ భవన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కృష్ణా నదిలో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయి, విఎంసికి చెందిన హెడ్ వాటర్ వర్క్‌లో ప్రమాణాలకు అనుగుణంగా నీటి శుద్ధి జరగడం లేదని తెలిపారు. తమ పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, ఇతర నాయకులు స్వయంగా నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి, హెచ్చరించినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. ఫలితంగా నగరంలో డయేరియా విజృంభించి తొమ్మిది మంది మృతి చెందారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన మంచినీరు అందించి ప్రజల ఆరోగ్యాలు, ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షలు, డయేరియాతో బాధపడుతూ ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సమావేశంలో సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, జిల్లా నాయకులు కె.దుర్గారావు పాల్గొన్నారు.

ఆగని అతిసార

ప్రాంతాల్లోనూ అతిసార కేసులు పెరుగుతున్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలువురు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందుతుండగా, ఆర్ఎంపిల వద్ద కూడా కొందరు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే మొగల్రాజపురం, కండ్రిక ప్రాంతంలో అతిసార బాధితులు తొమ్మిది మంది మృతిచెందగా, వందల మంది ఆయా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతూ అప్పులు చేసి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లా వైద్యాధికారులు, నగరపాలక సంస్థ అధికారులు ఈ కేసులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. అసలు అతిసార కేసులు లేవని కొట్టి పారేస్తుండటం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్ ధోరణిపై ఆగ్రహం

ఒక వైపున అతిసార బారిన పడి గత పది రోజుల నుంచి బాధితులు మృత్యువాత పడుతున్నా... మొగల్రాజపురం, పాయకాపురం ఏరియాల్లో వందల సంఖ్యలో వాంతులు, విరేచనాలతో నీరశించి వైద్యశాలల్లో చేరుతున్నా నగర కమిషనర్‌కు ఇవేమీ కనిపించడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. కమిషనర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు కలుషితం కావడం లేదని, అతిసార కేసులు లేవని ఒక ఐఎఎస్ స్థాయి అధికారి ఒక్క మాటతో అన్నంత మాత్రాన సరిపోతుందా అని సిపిఎం నేతలతో పాటు ఆయా ప్రాంతాల బాధిత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నీరు కలుషితం కావడం లేదన్నప్పుడు పకీర్‌గూడెం నుంచి మొగల్రాజపురం ఏరియాకు సరఫరా అవుతున్న బోర్ వాటర్ పైప్‌లైన్లను ఎక్కడికక్కడ కట్ చేసి నిలుపుదల చేసి, ట్యాంకర్ల ద్వారా మంచినీటిని ఎందుకు సరఫరా చేయాల్సి వస్తోందని ప్రశ్నిస్తున్నారు. గత నాలుగు మాసాల నుంచి రంగు మారిన, కలుషిత నీరు వస్తుందని నగర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వచ్చిన ఫిర్యాదలపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మంచినీటి కొరత కారణంగా విజయవాడ ఔట్ కట్స్ ఏరియా నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాంబేకాలనీ, పాయకాపురం, కండ్రిక, జక్కంపూడి (వైఎస్ఆర్ నగర్) తదితర ఏరియాల్లో నీరు అందక కలుషిత నీరు తాగుతూ... ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా... తీసుకున్న చర్యలు ఎంత వరకు వచ్చాయని ఆ ప్రాంతంలోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బందర్ కాలువ, ఏలూరు కాలువ, రైవస్ కాలువల్లో మురుగునీరు తాండవిస్తూ...పకీర్ గూడెంతో పాటు ఆయా ప్రాంతాల్లోని బోర్ వాటర్ కలుషితమవుతుంటే...ఆ నీటినే పైపుల ద్వారా ప్రజలకు ఎందుకు సరఫరా చేయాల్సి వచ్చిందని కమిషనర్‌ను ప్రశ్నిస్తున్నారు. విద్యాధరపురంలోని హెడ్ వాటర్ వర్క్స్‌లో ఆలం, క్లోరినేషన్, నీటిని శుద్ధి చేసే ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని, దానిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో నగర ప్రజలకు తెలపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫిల్టరేషన్‌లో నాణ్యత లేని ఇసుక, పరికరాల కొరత, నాణ్యత లేక నీటి శుద్ధి సమస్యలు ఉత్పన్నమవుతుంటే ...నేటి వరకు తీసుకున్న చర్యలపై కమిషనర్ వివరించాలని కోరారు. నగరపాలక సంస్థ, వైద్యఆరోగ్య తదితర శాఖలతో సమన్వయ సమావేశం ఇప్పటి వరకు ఎన్ని సమావేశాలు నిర్వహించారు, ఏమి నిర్ణయాలు తీసుకున్నారు, ఏ చర్యలు చేపట్టారో వివరించాల్సి ఉందని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నగర మేయర్, డిప్యూటీ మేయర్స్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు మృతుల కుటుంబాలను, డయేరియాతో బాధపడుతున్న వారిని నేటికీ పరామర్శించకపోవడంలో ఆంతర్యం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. నీరు కలుషితం అయిందా, లేదా, విరేచనాలు, వాంతులు, అతిసారతో సమస్యలు వచ్చిన విషయం వాస్తవమని నిర్ధారించారా, లేదా , దీనికి బాధ్యులు ఎవరని నగర వాసులు ప్రశ్నిస్తున్నారు. డయేరియా బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మొగల్రాజపురంలో బాధితులను కలుపుకొని సిపిఎం శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినా...ప్రతి రోజు డయేరియా కేసులు పెరుగుతున్నా...నగర కమిషనర్, మేయర్ స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని పౌర వేదికలు, పుర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అద్దనం నయీమ్ అస్మి హెచ్చరించారు ఆదివారం సాయంత్రం అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటించిన ఎస్పీ నియోజకవర్గ పరిధిలోని నేర ప్రవత్తి గల వారిని రౌడీషీటర్లను పిలిపించి అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కౌంటింగ్ సందర్భంగా నియోజక వర్గంలో ఎవరైనా శాంతి భద్రతలకు ఈ ఘాతం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం వచ్చిన ఫలితాలను సీరియస్ గా తీసుకోవద్దని, క్రికెట్ మ్యాచ్ లో గెలుపు ఓటములు ఏ విధంగా ఉంటాయో ఎన్నికల్లో కూడా గెలుపు వాటములను అదేవిధంగా పరిగణిం చాలని అలా కాకుండా ఎవరైనా అల్లర్లు సష్టించిన సష్టించాలని ప్రయత్నం చేసిన గ్రామాల్లో అలజడులకు కారకులైన వారిని గుర్తించి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట అవనిగడ్డ డిఎస్పి పి మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సిఐలు త్రినాథ్, నాగేంద్రప్రసాద్, ఆరు మండలాల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



నేర ప్రవత్తి గల వారిని హెచ్చరిస్తున్న ఎస్పీ



శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఎన్నికల్లో ఎవరూ గెలిచిన ప్రజలు సామరస్యాంగా ఉండాలని, గ్రామాలలో శాంతి భద్రత కాపాడాలని పమిడిముక్కల సిఐ కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని పమిడిముక్కల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడవద్దని, అలా పాల్పడితే జైలుకి పంపిస్తా మ న్నారు. గ్రామాల్లో పోలీస్ పికెట్ ఉంటుందని, ఎలాంటి సమ స్యలు వచ్చినా తమ దష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాలు ముక్కలు ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిరుగాలంకలో అన్నదానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని దక్షిణ చిరుగాలంక గ్రామంలో సత్య సాయిబాబా వార్షికోత్సవం సందర్భంగా జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సనక సుబ్రహ్మణ్యం కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మున్సి పల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు అరుదైన బ్లడ్ గ్రూప్ రక్తదానం చేసి ప్రాణ దాతగా నిలిచారు. రక్తదా నంపై ఎంతో అవగాహన కలిగి ఉండడమే కాకుండా, అందరికీ ప్రేరణగా కమిషనర్ దంపతులు అనేకసార్లు రక్తదానం చేశారు. ప్రత్యేకించి కమిషనర్ బ్లడ్ గ్రూప్ అరుదుగా లభ్యమయ్యే బి నెగెటివ్ కావటంతో ఆదివారం విజయవాడ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న రోగికి రక్తం అత్యవసరం కావటంతో స్వచ్ఛందంగా డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, మచిలీపట్నంలో రక్తదానం చేశారు. మెడికల్ ఆఫీసర్ డా. హనుమంతయ్య ఆయన్ని అభినందించారు.





వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తమాజేరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి చల్లపల్లి : పుట్టిన గ్రామాన్ని మరిచిపోకుండా గ్రామానికి వచ్చి వైద్యసేవలు అందించటం అభినందనీయమని పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, కూటమి అభ్యర్థి కాగిత కష్ణప్రసాద్ అన్నారు. డాక్టర్ కాగిత లక్ష్మీ నరేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తమాజేరు గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. శిబిరాన్ని సందర్శించిన కష్ణప్రసాద్ వైద్యు లను అభినందిం చారు. చాలామంది ఉన్నత చదువులను చదువుకుని దేశ విదేశాలకు వెళ్లిపోతారనీ, స్వగ్రామాలవైపు తిరిగి చూడరనీ, కాగిత కుటుంబీకులు సేవాభావంతో పుట్టిన ఊరిలో ప్రజలకు సేవచేయాలనే భావనతో వైద్యశిబిరం నిర్వహించటం సంతోష మన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. శిబిరానికి విశేష స్పందన లభించగా, సుమారు 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాగిత నరేంద్రబాబు మాట్లాడుతూ, మూలాలు మరిచిపోకుండా తాత ముత్తాలను గుర్తుచేసుకుంటూ స్వగ్రామంలో ప్రజలకు సేవలందిం చాలని కాగిత కుటుంబీకులైన వైద్యులంతా శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ కాగిత నరేంద్రబాబు, కాగిత రామమోహనరావుల పర్యవేక్షణలో జరిగిన వైద్యశిబిరంలో మాజీ పీపీ పరసా మదుసూధనరావు, పోసిన చెంచురామారావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి రామారావు, టీడీపీ నేత బొర్రా అగ్గిరాముడు, జెనిక్స్ బయోటెక్ జీఎం కాగిత రాజేశ్వరరావు, జె మిత్రా సేల్స్ మేనేజర్ కాగిత నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకు మూసివేత

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులోని కృష్ణాపురం వంతెన వద్దగల ఆదిత్య ఫీలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి టిన్నుల్లో పెట్రోల్, డీజిల్ కొడుతున్నారని సమాచారం రావడంతో ఆ పెట్రోల్ బొంకులో అమ్మకాలను ఆదివారం రెవిన్యూ అధికారులు నిలిపివేశారు. తాసిల్దార్ టి శ్రీనివాసరావు, డిప్యూటీ తాసిల్దార్ పద్మప్రియ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుభాషిని, విఆర్ఓ సుబ్బారావుతో కలిసిన బందం ఆదిత్య ఫీలింగ్ స్టేషను పరిశీలించారు. టిన్నుల్లో పెట్రోల్ కొడుతున్నారని సమాచారంతోపాటు వీడియో రావడంతో వెంటనే రెవిన్యూ అధికారులు కొరడా జూలిపించారు. స్థానిక రెవెన్యూ అధికారులు పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని అమ్మకాలను నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేశారు. తక్షణమే అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ టీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించి టిన్నెల్లో పెట్రోల్, డీజిల్, కొడుతున్న ఆదిత్య ఫీలింగ్ స్టేషన్ అమ్మకాలు నిలుపుదల చేసినట్లు, తదుపరి చర్యల కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు తెలిపిన ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-చల్లపల్లి స్థానిక నారాయణరావు నగర్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహ కులు అనగాని నాగేశ్వరరావు సోదరులు బుద్ధప్రసాద్ కు కండువా కప్పి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, టీడీపీ నేతలు రావి చిట్టిబాబు, మోర్ల శివ, షేక్ నబీఘోరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రేడ్ 3 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం మొదటిగా విద్యార్థులచే పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు చేయించారు. అలాగే విద్యార్థులచే కథలు చదివించారు. తదుపరి గుడివాడ విశ్రాంత ఉపాధ్యాయు సి.హెచ్. నారాయణ స్వామి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ చెప్పారు. విద్యార్థులు జ్ఞాపకశక్తి ఎలా పెంపొందించుకోవాలో తెలియచేశారు. హౌసీ, చెస్, క్యారమ్స్ ఆటల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎం.వి. ఎస్. లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మానసిక శారీరక వికాసానికి యోగాసనం చాలా మంచిదని గ్రంథాల అధికారిని టి వాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద ఆదివారం వేసవి విజ్ఞానం శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఎం చిన్న రాయుడు చే యోగ క్లాస్లు నిర్వహించారు. పఠన సామర్థ్యాన్ని కథల రూపంలో చదివించారు. అనంతరం క్యారమ్స్ ఆటల పోటీలను నిర్వహించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** వేసవిజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం అవనిగడ్డలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వివిధ విభాగాలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం శేషగిరిరావు, ఎం ఉషారాణి పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ సిబ్బంది కార్యక్రమం నిర్వహించారు.



అవనిగడ్డలో...



గుడ్లవల్లేరులో...



పెదపారుపూడిలో...

హోమియో వైద్య శిబిరం



ప్రజాశక్తి-ఉయ్యూరు : గండి గుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా హెూ మియో వైద్య శిబిరం నిర్వహించి 150 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అంద జేశారు. గుడివాడ హెూ మియో వైద్యశాల వైద్యులు ప్రదీప్, రసగ్న వైద్య పరీక్షలు చేశారు. నారాయణం పురుషోత్తమచార్యులు, కొల్లిపర రామకష్ణప్రసాద్, వెంకట్రా మయ్య, క్రాంతికుమార్ తదితరులు పాల్గొని సేవలందించారు.



అతిసార బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: డయేరియాతో జనం పిట్టల్లా రాలిపోతున్నా నగర మేయర్, నగర కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు బుకాయించడం తప్పా...వారిలో ఎటువంటి చలనం లేకుండా పోయిందని , ఇప్పటికయినా మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోకుంటే ఈ నెల 6వ తేదీ తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, జిల్లా నాయకులు కె దుర్గారావుతో కలిసి శ్రీశ్రీ భవన్‌లో ఆదివారం కాశీనాథ్ విలేకరులతో మాట్లాడారు. మంచినీటి సరఫరాలో లోపించిన వైఫల్యం, డయేరియా మృతులు, రోగుల వ్యవహారంలో అధికార వైసిపి, నగర కమిషనర్ తప్పుదారి పట్టిస్తున్న వైనంపై పలు ప్రశ్నలు సంధించారు. కలుషిత నీరు, అతిసార మరణాలపై నిపుణుల బృందాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. స్వచ్ఛమైన కృష్ణానది మంచినీరు అందించి ప్రజల ఆరోగ్యాలు, ప్రాణాలు కాపాడటంతో పాటు డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున, డయేరియాతో బాధపడుతూ ఆయా ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న రోగులకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, లేనట్లయితే ఈ నెల 6వ తేదీ తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని కాశీనాద్ హెచ్చరించారు. ఆ తరువాత జరగబోయే పరిణామాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత వహించాల్సి వస్తోందని హెచ్చరించారు. కృష్ణానదిలో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయి, విఎంసికి చెందిన భవానీపురం హెడ్ వాటర్ వర్క్‌లో ప్రమాణాలకనుగుణంగా నీటి శుద్ధి జరగడం లేదని, నీటి కొరత, కలుషిత నీరు, రంగుమారిన, దుర్వాసన, మట్టితో కూడిన నీటిని సరఫరా చేస్తున్నందున నగర ప్రజలు డయేరియా బారిన పడుతున్నట్లు గత మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే తమ పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, ఇతర నాయకులు స్వయంగా నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి, హెచ్చరించినా నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఫలితంగా నగరంలో డయేరియా విజృంభించి 9 మంది మృతి చెందడంతో పాటు వందల మంది ఆయా వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నదిలో నీటి మట్టం తగ్గి, తీవ్రమైన నాచు, కలుషిత సమస్యలు గుర్తించినా నగరపాలక సంస్థ ప్రత్యామ్నాయ చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు.

ఊర్మిళానగర్ - కబేళాకు రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని ఊర్మిళానగర్ నుంచి కబేళాకు వెళ్ల రోడ్డు భారీ గోతులతో ప్రమాదకరంగా తయారైన పరిస్థితిని 'వామ్మో గోతులు' కథనంతో ప్రమాదకరంగా కబేళా రోడ్డుపై నిత్యం ప్రయాణించే భారీ వాహనాలు, లారీలు ఆ గోతుల్లో పడి ఇబ్బందులను ఈ నెల 27న ప్రజాశక్తిలో ప్రచురించిన వార్తకు నగరపాలక సంస్థ విఎంసి అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి గుంతలు పడిన ఊర్మిళానగర్ నుంచి కబేళా రోడ్డుకు మరమ్మతులు చేసి తారురోడ్డు నిర్మాణం చేసి, బాగుచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో భారీ వాహనదారులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతులు చేసిన అనంతరం రోడ్డు

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

విజయవాడ : పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, వన్ ఎర్త్ వన్ లైఫ్ సంయుక్తంగా చిత్రలేఖనం పోటీలను ఎం.బి.వి.కెలో నిర్వహించారు. దాదాపు 200 మంది చిన్న పిల్లలు పర్యావరణం పరిరక్షణ అంశంపై పోటీలలో పాల్గొన్నారు ఈ సందర్భంగా జరిగిన సభకు సిద్ధార్థ మహిళా కళాశాల ఓటమి లెక్చరర్ సుశీల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడినప్పుడే పర్యావరణాన్ని నిజంగా పరిరక్షించిన వాళ్ళం అవుతామని అన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేటట్టు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని దానికి ప్రత్యామ్నాయంగా రాజు స్టీల్ క్లాత్ వాడకాలను ప్రోత్సహించాలని ఆమె కోరారు. పిల్లలంతా ఇప్పటినుంచి ప్లాస్టిక్ వాడకాన్ని ఇంట్లో వాడకుండా కృషి చేయాలని ఉన్నారు. ఈ కార్యక్రమానికి మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు టీ క్రాంతి కిరణ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 పర్యావరణ దినోత్సవాన్ని సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరుగుతోందని భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి అనే మూడు థీమ్‌లతో ఈ కార్యక్రమం జరుగుతోందని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే పర్యావరణం నాశనం అవ్వడానికి కారణం అవుతున్నాయని విమర్శించారు. పర్యావరణాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన సమయం ఏర్పడిందని ఆయన అన్నారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ కాల్ చేసి ఏలూరు ఎలా కుమారి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందులో భాగంగా మొక్కల్ని నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించుకోవడానికి కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంట్లో తమకు ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో గార్డెనింగ్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్రను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులు సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణాన్ని రక్షించుకోవాలని తమ ఆకాంక్షను ఈ చిత్రలేఖనం పోటీల ద్వారా నిరూపించారని ప్రతి ఒక్కరూ అద్భుతమైన చిత్రాలను గీయడం ద్వారా సమాజంలో రేపటి పౌరులుగా ఉన్న పాము పర్యావరణం పరిరక్షణలో భాగంగా ముందు ఉంటామని చెప్పినట్టే అన్నారు. తక్కువ టైంలో నైనా అద్భుతమైన చిత్రాలను గీసిన విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన 29 మందికి బహుమతి ప్రదానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి ఏ శేఖర్, ద్వితీయ బహుమతి వినయ్ కటారి, తృతీయ బహుమతి శివ శత్విక్, మరో ఐదుగురికి కన్సోలేషన్ ప్రైజులు గెలుచుకున్నారు. జూనియర్ శుభాకాంక్షలు ప్రథమ బహుమతికే సహస్ర ద్వితీయ బహుమతి కృష్ణవర్ధన్ తృతీయ బహుమతి కె.జాహ్నవి, మరో ఐదుగురు కన్సోలేషన్ ప్రైజులు గెలుచుకున్నారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పి.శ్రీవల్లి ద్వితీయ బహుమతి కె.జాహ్నవి తృతీయ బహుమతి సాహితి పుసునూరి, మరో ఐదుగురికి కన్సోలేషన్ ప్రైజులు గెలుచుకున్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



మాట్లాడుతున్న సుశీల

ఆదర్శ కార్మిక నేత సత్యనారాయణ

ప్రజాశక్తి - విజయవాడ : సిఐటియు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పర్సా సత్యనారాయణ ఆదర్శ కార్మిక నేత అని కార్మిక సంఘాల నేతలు కొనియాడారు. ఆదివారం స్థానిక దుర్గాపురం సిఐటియు నగర కార్యాలయంలో పర్సా సత్యనారాయణ శతజయంతి స్మారక కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్సా స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారని గుర్తు చేసుకున్నారు. సింగరేణిలో కార్మిక సంఘం పెట్టారని చెప్పారు. కార్మికులతో కొనసాగించిన సజీవ సంబంధాల వల్ల పాల్వంచ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యారని అన్నారు. విశాఖ ఉక్కు ఆందోళన సందర్భంగా శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారని తెలిపారు. సిఐటియు సంఘానికి మూడు దశాబ్దాల పాటు రాష్ట్ర అధ్యక్షుడిగా అఖిలభారత ఉపాధ్యక్షునిగా సేవలందించారన్నారు. పర్సా చిత్రపటానికి సీనియర్ నేతలు ఎంఎం.పాత్రుడు టి.ప్రభుదాసు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ నేతలు ఎం.వి.సుధాకర్ కె.దుర్గారావు, టి.ప్రవీణ్, వై.సుబ్బారావు, ఎం.బాబూరావు పెన్షనర్స్ నాయకులు ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.



పర్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పోలీసు బలగాలతో మాక్ డ్రిల్

ప్రజాశక్తి - గంపలగూడెం : జరగనున్న సాధారణ ఎన్నికల్లో కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా చర్య లు తీసుకు నేం దుకు పోలీస్ శాఖ సిద్ధ మైంది. అం దులో భాగం గా ఆది వారం ప్రత్యేక బలగాలతో పెను గొలను, తునికి పాడు గ్రామాల్లో మాకుడ్రిల్ నిర్వహించింది. ఈ సందర్భంగా తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా అసదర్భ వ్యాఖ్యలు చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిని నెలకొల్పేం దుకు తాము సిద్ధంగా ఉంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్. శ్రీనివాస్ సిబ్బంది ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సార్వత్రిక ఎన్నికలు -2024 ఎన్నికల ప్రక్రియలో భాగంగా జూన్ 4న కౌంటింగ్ నిమిత్తం ఎన్టీఆర్ జిల్లాలో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది ఒకే ప్రదేశంలో గుమ్మికూడి ఉండకూడదని ఇబ్రహీంపట్నం సిఐ ముత్యాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ సెంటర్ల చుట్టుపక్కల గల నివాసాల్లో కుటుంబ సభ్యులు తప్ప కొత్త వ్యక్తులు ఎవరికి ఆశ్రయం కల్పించవద్దని, ప్రజలు రోడ్లపైకి రావద్దని పోలీసు వారి అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకూడదని, ఏ విధమైన బాణాసంచా కాల్చరాదని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించరాదని, కళ్యాణ మండపాలు లాడ్జిల్లో ఎవరికి ఆశ్రమం కల్పించొద్దని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా కౌంటింగ్ సెంటర్‌లకు వచ్చే కౌంటింగ్ ఏజెంట్స్ ఎవరూ కౌంటింగ్ సెంటర్‌లోనికి వారి సెల్ ఫోన్స్‌ను తీసుకొని రాకూడదని తెలిపారు. జగ్గయ్యపేట నందిగామ వైపు నుండి వచ్చే కౌంటింగ్ ఏజెంట్స్ వారి వాహనంలో కేతనకొండ దగ్గరలో గల పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసి అక్కడ ఏర్పాటు చేసిన బస్సుల్లో కౌంటింగ్ సెంటర్‌కు రావాలి. తిరువూరు మైలవరం వైపు నుండి వచ్చే కౌంటింగ్ ఏజెంట్స్ ఏ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో వారి వాహనాలు పార్క్ చేసి అక్కడ ఏర్పాటు చేసిన బస్సుల్లో కౌంటింగ్ సెంటర్‌కి రావాలని సూచించారు. విజయవాడ వైపు నుండి వచ్చు కౌంటింగ్ ఏజెంట్స్ వారి వాహనాలను పవిత్ర సంగమం దగ్గర గల పార్కింగ్ ప్రదేశంలో పార్క్ చేసి అక్కడ ఏర్పాటు చేసిన బస్సుల్లో కౌంటింగ్ సెంటర్లకు వెళ్ళాలన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గల కౌంటింగ్ సెంటర్‌ల వద్ద, చుట్టుపక్కల 900 మంది పోలీస్ సిబ్బందితో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ పి.హెచ్‌డి. రామకృష్ణ, జిల్లా కలెక్టర్, వెస్ట్ డిసిసి, వెస్ట్ ఏసిపి కలిసి పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా వ్యక్తులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన, ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన, ఆటంకాలు కల్పించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురుగు కాల్వల్లో తాగునీటి పైపులైన్లు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరంలో కలుషిత మంచినీటితో మృత్యువాత పడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్ రోటరీనగర్ ప్రాంతంలో మురుగు కాలువల్లో మంచినీటి పైపులైన్ కనెక్షన్స్ ఉండటంతో మంచినీరు కలుషితమవుతున్నాయంటూ స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రోటరీనగర్ వాసుల ఇబ్బందులను ఈనెల 1వ తేదీ శనివారం 'ప్రజాశక్తి'లో "మురుగు కాల్వల్లో తాగునీటి పైపులు" - కనెక్షన్ తొలగించాలని డిమాండ్ చేస్తున్న రోటరీ నగర్ వాసులు అన్న శీర్షిక ప్రచురితమైన విషయం విధితమే. దీంతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు విఎంసి అధికారులు వెను వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన అదేరోజు మంచినీటి విభాగం సర్కిల్ -1 ఎ.ఇ. అహ్మద్ నేతృత్వంలో దగ్గరుండి రోటరీనగర్‌లో మురుగు కాల్వల్లో వున్న తాగునీటి పైపులైన్లను తొలగించారు. అదే ప్రాంతంలో కొంతకాలంగా ప్రధాన పైపులైన్ నిర్మాణం చేశారు. వాటికి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. అధికారులు ఇప్పటివరకూ కొత్త పైపులైనుకు ఇంటింటి కుళాయిల కనెక్షన్లు ఇవ్వకపోవటం వల్ల పాత పైపులైన్లు మురుగునీటిలో ఉండటంతో కలుషిత నీరు రావటమే గాక దుర్వాసన వస్తుండటంతో రోటరీనగర్ వాసులు భయాందోళనలు వ్యక్తం చేశారు. అయితే త్వరలో కొత్త పైపులైన్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇస్తామని ఎ.ఇ. అహ్మద్ స్థానికులకు తెలిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రజాశక్తికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



పనిచేస్తున్న సిబ్బంది



డ్రైయినేజీలో పైపులైన్లు



డ్రైయినేజీ నుండి వేరు చేసిన దృశ్యం

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కష్ణా జిల్లాలో జూన్ 4 న ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత మధ్య పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు వేరువేరు కౌంటింగ్ హాళ్ళ ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి 14 కౌంటింగ్ టేబుళ్ళ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం ఓట్లు 15,39,460 కాగా మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 7 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లు 12,93,935 కాగా, ఒక్కొక్క సెగ్మెంట్కు 14 కౌంటింగ్ టేబుళ్ళచొప్పున ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.7 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలైన ఓట్లు 12,93,948 కాగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ళ చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టేబుల్ కు ఒక అదనపు ఏ ఆర్ ఓ, ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక కౌంటింగ్ అబ్జర్వర్ లను నియమించడం జరిగిందన్నారు. వీరికి అవసరమైన శిక్షణ ఇచ్చి, ఈసీ మార్గదర్శకాలు కౌంటింగ్ ప్రక్రియ పట్ల తగిన అవగాహన కల్పించినట్లు, సకాలంలో ఫలితాలు ప్రకటించుటకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు.

రౌండ్ల వారి ఫలితాల ప్రకటన : మచిలీపట్నం అసెంబ్లీ స్థానం ఫలితాలు 15 రౌండ్లు, పెడన అసెంబ్లీ స్థానానికి 16 రౌండ్లు, గుడివాడ, పామర్రు అసెంబ్లీ స్థానాలకు 17 రౌండ్ల చొప్పున, అవనిగడ్డ అసెంబ్లీ ఫలితం 20 రౌండ్లు, గన్నవరం పెనమలూరు అసెంబ్లీ స్థానాలకు 22 రౌండ్లలో ఫలితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ ప్రకారం తొలి ఫలితం పెడన తదుపరి మచిలీపట్నం ఫలితం వచ్చే అవకాశం ఉందన్నారు.

ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు : జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి మొత్తం 21,579 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా, 7 అసెంబ్లీ స్థానాల పరిధిలో మొత్తం 21,728 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయన్నారు. మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ళు ఏర్పాటు చేశామని, వీటి ఫలితాలు ఈవీఎం ఓట్ల ఫలితాలతో జతచేసి ప్రకటించడం జరుగుతుం దన్నారు. అదేవిధంగా 7 అసెంబ్లీ స్థానాల పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు పామర్రు 2 టేబుల్స్ , పెడన 3 టేబుల్స్ , గన్నవరం 5 టేబుల్స్, గుడివాడ, పెనమలూరు 6 టేబుల్స్ చొప్పున, మచిలీపట్నం, అవనిగడ్డ 8 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. వీటి ఫలితాలు కూడా ఈవీఎం ఓట్ల ఫలితాలతో జతచేసి ప్రకటించడం జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, అనంతరం ఉ.8.30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు.

మూడంచెల భద్రత : ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. అందులో మూడు సెక్షన్ల కేంద్ర బలగాలు, మూడు సెక్షన్ల రాష్ట్ర సాయుధ దళాలు, రాష్ట్ర సివిల్ పోలీస్ బలగాలతో నిరంతరం పటిష్ట భద్రత కల్పించామన్నారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా స్ట్రాంగ్ రూములతో సహా ఓట్ల లెక్కింపు కేంద్రంలో భద్రత కోసం, నిరంతర పర్యవేక్షణ కోసం110 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి కౌం టింగ్ హాళ్లలోనికి కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులు వెళ్లడానికి వేరు వేరు మార్గాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఏ నియోజకవర్గానికి ఎటు వెళ్లాలో నిర్దేశిస్తూ ఫ్లెక్సీ బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు. రౌండ్ వారి ఫలితాలను ప్రకటించేందు కోసం కమ్యూనికేషన్ రూమును, మీడియా కవరేజ్ కోసం మీడియా సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ చికిత్స కోసం వైద్య శిబిరాన్ని కూడా ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రవేశించే మార్గంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అన్ని విధాల తనిఖీ చేసిన తర్వాతనే లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.అలాగే అగ్ని ప్రమాద నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని, ఆ ఇందుకోసం అగ్నిమాపక శకటాలు, సంబంధిత పరికరాలతో సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, తదితరులు

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ జిల్లాల్లో ఓట్ల లెక్కింపునకు సన్నద్ధతపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ జేసి, రిటర్నింగ్ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకు ఒక్కొక్క నియోజకవర్గానికి 14 కౌంటింగ్ టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేశామని అన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి 2వ రాండమైజేషన్ నిర్వహించి ఆయా నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు విధులు కేటాయించినట్లు తెలిపారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తి చేసామని, ఆదివారం రెండో విడత శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. వీరితోపాటు ఆయా పార్టీల అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లకు కూడా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం కష్ణా విశ్వవిద్యాలయం వద్ద స్ట్రాంగ్ రూములతో సహా కేంద్ర, రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రత కల్పించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 144, సెక్షన్ 30 అమలు చేస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు ఆర్డీవోలు ఎం. వాణి, పి. పద్మావతి, డి. రాజు, పామర్రు రిటర్నింగ్ అధికారి శ్రీదేవి, అవనిగడ్డ రిటర్నింగ్ అధికారి బాలసుబ్ర మణ్యం, ఎన్నికల సమన్వయ అధికారి దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

కాలువల్లో గుర్రపు డెక్క తొలగించాలి

ప్రజాశక్తి - గుడివాడ : ప్రధాన పంట కాలువలు గుర్రపు డెక్కతో నిండిపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎంకార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తట్టివర్రు రోడ్డులోని ప్రధాన పంట కాలువను పరిశీలించారు. కాలవలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను చూపిస్తూ ఇది గుడివాడ పట్టణానికి మంచినీళ్లు అందించే ప్రధాన పంట కాలువని, కాలువ మొత్తం పూర్తిగా గుర్రపు డెక్కలతో నిండిపోయిం దన్నారు. ఈ పంట కాలువ ద్వారా కింద వందల ఎకరాలు రైతులు సాగు చేసుకుంటున్నారని అనేక గ్రామాల ప్రజలు మంచినీటిగా ఉపయోగిస్తున్నారని వాపోయారు. పంట కాలువను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రధాన పంట కాలవలు డ్రైన్లు శుభ్రం చేయాలని సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.



కాలువలో గుర్రపు డెక్క చూపిస్తున్న ఆర్‌సిపి రెడ్డి

నాణ్యమైన విద్యకు సాటి 'మారుతీ' కళాశాల



ప్రజాశక్తి-కోడూరు : ప్రైవేట్ కళాశాల అంటేనే అధిక ఫీజులు అనుకునే తరుణంలో కోడూరు మండలంలోని మారుతి జూనియర్ కళాశాలను ఒకసారి చూసామంటే విద్యార్థులు, తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను మార్చు కుంటారు. మారుతి జూనియర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థుల తరగతి గదులు విశాలవంతంగా ఉంటాయి. కళాశాల ఆవరణలో విద్యార్థులకు పలు రంగాలలో తర్ఫీదు ఇస్తూ విద్యార్థులను చదువులో మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో ముందంజలో ఉంచడానికి నిరంతరం కళాశాల యాజమాన్యం కషి చేస్తోంది. కళాశాలలో ర్యాగింగ్ అనే మాట అసలు తావు లేకుండా చేస్తూ విద్యార్థులకు తోటి విద్యార్థుల పట్ల స్నేహపూర్వక వాతావరణంలో విద్య అందిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 2017వ సంవత్సరం నుంచి ఫిజిక్స్ మూర్తి నేతత్వంలో నడుస్తున్న మారుతి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారు. మారుతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు, రెండుసార్లు రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించిన విద్యా సంస్థ అని కళాశాల ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు. తీర ప్రాంతాల గ్రామాల నుంచి చదువుకునే విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకుని వారికి అందుబాటులో ఫీజులు తీసుకుంటూ వారి ఉన్నతికి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ తోడ్పడు తున్నట్లు తెలిపారు.కోడూరు మండలంలో ఇంటర్‌తో పాటు లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ ఎంసెట్ కార్డు నిర్వహిస్తున్న ఏకైక విద్య సంస్థ తమని, అర్హత అనుభవం కలిగిన అధ్యాపక బందంచే క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను చదువుతోపాటు క్రమశిక్షణకు మారుపేరుగా తయారు చేస్తున్నా మన్నారు. జూన్ 3వ తేదీన క్లాసులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు.



ప్రిన్సిపాల్ మూర్తి



మారుతీ కళాశాల నూతన భవనం




బహుమతులు సాధించిన విద్యార్థినులు



విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కనక విజయలక్ష్మి మృతికి సంతాపం



విజయలక్ష్మి (ఫైల్)

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ) : మండల పరిధిలోని చిన ముత్తేవి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత రావూరి అజయ్ కుమార్ సతీమణి కనక విజయలక్ష్మి (65) అమెరికాలోని కుమారుని గృహంలో భారతీయ కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 11 గంటలకు బ్రెయిన్ స్ట్రోక్ తో మరణించారు. గత నెల విమానంలో అమెరికాకు బయల్దేరిన ఆమె స్పృహ తప్పి పడిపోవడంతో సిబ్బంది ఆమెను వైద్యం కోసం ఆసుపత్రి తరలించారు. నాటి నుండి నేటి వరకు కోమాలో ఉన్న ఆమె ఆదివారం మరణించారు. భౌతిక కాయాన్ని వైద్య పరీక్షల కోసం అమెరికాలోని వైద్య కళాశాలకు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కుమార్తె ప్రియాంక, బంధువులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మతి పట్ల మండల పార్టీ కార్యదర్శి కాకి రాజశేఖర్ మండల పార్టీ నాయకులు మద్దుల బసవయ్య, రావూరి రమేష్, స్నేహితులుగ్రామస్తులు నివాళులు అర్పించారు.విజయలక్ష్మి మతి పట్ల సిపిఎం కష్ణా జిల్లా కమిటీ జోహార్లు అర్పిస్తుంది. వారి కుటుం బ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహార రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు విజయ లక్ష్మి మతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు



కలెక్టర్ దంపతులకు చిత్రపటం అందిస్తున్న అర్చకులు

కొండాలమ్మను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులకు అమ్మవారి శాష వస్త్ర ములు చిత్రపటంతో సత్కరించినట్లు ఆలయ కార్యనిర్వహ ణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, రెవిన్యూ, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించు కునేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుండి సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబళ్లను తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.



జవహర్ రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న జవహార్ రెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆదివారం ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి వారు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. అనంతరం వీరు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



మైలవరంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ బాబు

ప్రజాశక్తి - మైలవరం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.సురేష్ బాబు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగాల గురించి వివరించారు. గ్రంథాలయాల్లో ఎన్నో రకాల జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలుంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి తరగతులు విజయవంతంగా కొనసాగుతున్నాయని గ్రంథాల అధికారి పద్మావతి తెలిపారు. దానిలో భాగంగా ఆదివారం విద్యార్థుల చేత పుస్తకాలు చదివించటం, చిత్రలేఖనంలో పోటీ నిర్వహించటం వంటి కార్యక్రమాలు నిర్వహించి వివిధ ఆటలు ఆడించినట్లు చెప్పారు. **జగ్గయ్యపేట :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంచాలకుల వారి ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. తదుపరి గ్రంథపాలకురాలు విద్యార్థులకు పుస్తక సమీక్ష పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు టి.ప్రసాద్ బాబు విద్యార్థులకు నీతి కథలు, నీతి వాక్యాలు, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఏ ప్రభ, వర్షిత, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహద పడతాయని కంచికచర్ల గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు అన్నారు. కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం 33 వ రోజు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న విద్యార్థి దశలోనే పుస్తక పఠనం చేయటం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పాటు పోటీ పరీక్షల్లో రాణించవచ్చన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని గ్రంథాలయాల ద్వారా వేసవిలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించారు. క్రాఫ్ట్ మాస్టర్మ్ కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. పాటలు పాడించారు. డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్ కుమార్ విద్యార్థులకు డాన్స్ నేర్పించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ నుండి యోగా మాస్టర్ మేడూరి మాణిక్యాలరావు విద్యార్థులకు తాడాసనం, పక్షి క్రియ, సుఖాసనం, పద్మాసనం వంటి యోగాసనాలు నేర్పించారు. అనంతరం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. చెస్, షటిల్, టెన్నికాయిట్, మ్యూజికల్ ఛైర్స్ ఆడించారు.

రద్దీ రోజుల్లో ప్రత్యేక విధులు

దుర్గగుడి ఇఓ కె.ఎస్. రామారావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం విచ్చేసే యాత్రికులు సౌకర్యార్థం రద్దీ రోజుల్లో దేవాలయ కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావటం వల్ల ఆంధ్రప్రదేశ్, పక్క తెలంగాణా రాష్ట్రం నుంచి కూడా భక్తుల సంఖ్య అధికంగా ఉంది. ఈరోజు ఆదివారం సందర్భంగా అమ్మవారి దర్శనార్థం యాత్రికులు విశేష సంఖ్యలో విచ్చేయటంతో యాత్రికుల రద్దీ దృష్ట్యా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇఓ రామారావు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగానే వారంలో శుక్ర, శని, ఆదివారాల్లో కూడా యాత్రికుల, భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్నందున ఆలయ కార్యాలయం సిబ్బందికి కూడా రద్దీని అనుసరించి ప్రత్యేక రోజులలో ఇఓ రామారావు రద్దీ క్రమబద్ధీకరణకు గాను ప్రత్యేక విధులు కేటాయించారు. రద్దీ దృష్ట్యా ఈవో పలు కౌంటర్లు, పరిశీలించి సిబ్బందితో మాట్లాడి, అధికారులకు సూచనలిచ్చారు. వేసవి సందర్భంగా దేవస్థానంలో ప్రతిరోజూ మధ్యాహ్నం మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిత్య ఆర్జిత సేవల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.



క్యూ లైన్లను పరిశీలిస్తున్న ఆలయ ఇఓ కెఎస్ రామారావు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న గంగాధర్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్లో జన విజ్ఞాన వేదిక నిర్మాణంలో భాగంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లా జనవిజ్ఞాన వేదిక కమిటీల సంయుక్త సమావేశం కొండపల్లిలోని క్రాంతి హైస్కూల్లో జరిగింది. ఈ సమావేశానికి జెవివి ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అధ్యక్షుడు వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జెవివి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జెవివి నిర్మాణం, అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలను వివరాలను, భవిష్యత్తులో జెవివి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి వివరించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానం ప్రచారం చేయటం శాస్త్రీయ దక్పథం పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. జెవివి ద్వారా పాఠశాలలు కళాశాల విద్యార్థులను శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కొండపల్లి జెవివి గౌరవ అధక్షులు డాక్టర్ మామిడి శీతారామారావు మాట్లాడుతూ శాస్త్రీయ దృకృథం అభివద్ధి చెందడానికి కావలసిన సాహిత్యాన్ని ప్రజలకు అందజేయడానికి కృషి చేయాలన్నారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జెవివి నిర్మాణానికి తీసుకోవాల్సిన వివిధ కార్యక్రమాల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ మురళీమోహన్, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పట్ల కామేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.జాన్ బాబు ఉభయ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రెండు నెలల నుంచీ ప్రతి ఆదివారం దాహార్తులకు మజ్జిగ పంపిణీ సేవాకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హరివిల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శరత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏలూరు రోడ్డులోని రాజ్ టవర్స్ పక్కన పాదచారులకు, వాహన చోదకులకు చల్లటి మజ్జిగను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు ప్రధానకార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా తమ ఫౌండేషన్ తరపున నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేకించి తాము చేస్తున్న మజ్జిగ పంపిణీలో వీలయినంతవరకూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో డిస్పోసబుల్ గ్లాసులను వాడకుండా కేవలం స్టీలు గ్లాసులలోనే ప్రజలకు మజ్జిగను అందజేస్తున్నామన్నారు. ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు. కనకారావు మాట్లాడుతూ గత రెండు నెలలుగా తమ ఫౌండేషన్ ద్వారా విజయ వాడలోని వివిధ ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ సేవాకార్య క్రమాన్ని చేస్తున్నామని, అన్నారు. ఈ వేసవి సెలవుల్లో విజయవాడకు ప్రత్యేకించి ఏలూరు రోడ్డు, బీసెంటురోడ్డుకి బయటి ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారని వారిలో ఎక్కువగా కుటుంబసభ్యులతో కలిసి ఈ ప్రాంతానికి వస్తుంటారని అని తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా ఇలా సేవ చేయడం తమకు ఆనందం కలిగిస్తుందని, తాము చేస్తున్న ఈ సేవాకార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియచేసారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఫౌండేషన్ సీనియర్ సభ్యులు ఎం.బాలసూర్య నారాయణ, ఫౌండేషన్ సభ్యులు జి.ఎన్.బి.అప్పలరాజు, నజీర్ మొహమ్మద్, చింతాడ శివ, కోడేదాసు శ్రీనివాసరావు, ఇమ్మడి భార్గవ్, పత్తికాయల లక్ష్మణరావు తదితరులు పాల్గొని తమ సేవలను అందజేశారు.

సిఆర్‌డిఎ మాజీ డైరెక్టర్‌కు సన్మానం



రాముడు దంపతులను సత్కరిస్తున్న ఎన్.వి. రావు, వేముల వెంకట్రావు తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఏపీ సిఆర్‌డిఏ మాజీ డైరెక్టర్ వి. రాముడు దంపతులకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు వేముల వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనసత్కారం జరిగింది. ఆదివారం విజయవాడ ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ విఘ్నేష్ స్టూడియోలో ఏపీ సిఆర్‌డిఏ వి.రాముడు రిటైర్మెంట్ సందర్భంగా రాముడు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ రాముడు ఎంతో కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చారని, మంచి అధికారిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారని ప్రశంసించారు. అబ్దుల్ కలాం సేవాసమితి అధ్యక్షులు వేముల వెంకట్రావు మాట్లాడుతూ యువత అంతా కూడా ఏపీ సిఆర్‌డిఏ మాజీ డైరెక్టర్ రాముడుని ఆదర్శంగా తీసుకొని బాగా చదువుకొని మంచి అభివృద్ధి సాధించాలన్నారు. నిజాయితీగల అధికారిగా రాముడు సేవలందించారని కొనియాడారు. ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని వెంకటరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్ ప్రెసిడెంట్ రాజగిరి సోమేశ్వరావు, నమ్మి అప్పారావు, పేరం కోటిరెడ్డి, కిలారు జగదీష్ ,దేవర వెంకట్రావు, పి. పరమేశ్వరరావు, ఎల్. శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేముల మృతి

ప్రజాశక్తి - కంచికచర్ల : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఎసిసి సెల్ ప్రధాన కార్యదర్శి వేముల జయరాజు (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన జయరాజు కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త నుండి పనిచేశారు. పార్టీ కష్టకాలంలో గడచిన పదేళ్ల కాలంలో పార్టీ పిలుపును భుజాన వేసుకున్నాడు. కంచికచర్లలో రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాల పునర్నిర్మాణానికి కషి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. తీవ్ర ఎండలకు అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందారు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. జయరాజు మృతదేహాన్ని పలు రాజకీయ పార్టీల నాయకుల సందర్శించి నివాళు లర్పించారు.

తెలంగాణా మద్యం స్వాధీన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని జయంతీపురం గ్రామంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తెలంగాణలోని మేళ్ల చెరువు గ్రామం నుండి నందిగామ మండలం పెద్దవరం గ్రామంకు టి.ఎస్.4 ఈ అర్ 187 మహేంద్ర రెనాల్ట్ కారులో తరలిస్తున్న 1,572 మద్యం సీసాలు (303 లీటర్లు) జగ్గయ్యపేట సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకున్నారు. జూన్4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రభుత్వం మద్యం దుకాణాకు సెలవు ఇచ్చిన నేపథ్యంలో ఆ రోజుల్లో పెద్ద ఎత్తున మద్యం అక్రమంగా అమ్మకాలకు ఈ విధంగా భారీ ఎత్తున మద్యం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ సోదాల్లో పెద్దవరం గ్రామానికి చెందిన సింగంశెట్టి శ్రీకాంత్‌ను అరెస్టు చేయగా చెరుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన దూలం నరేంద్ర రెడ్డి ఆలియా ఆలియా గోపిరెడ్డిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

కోడ్‌ను అతిక్రమిస్తే వేటు తప్పదు

ప్రజాశక్తి - విసన్నపేట : ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఎన్నికలు జరిగిన విషయం అందరికీ తెలిసిందే జూన్ నాలుగో తేదీన మంగళవారం ఎన్నికల లెక్కింపు జరుగుతున్న దృష్ట్యా ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించవలసినదిగా కోరుచున్నాం ఎంతమంది పోటీలో ఉన్న గెలిచేది ఒక్కరే కాబట్టి గెలిచినవారు ఎటువంటి ఊరేగింపులు కాని, అభిమానులు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉండాలని ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ప్రస్తుతం అన్ని గ్రామాల్లో సిఆర్‌పిసి 144 సెక్షన్ ఇంకా అమల్లో ఉన్నందున ఎన్నికల లెక్కింపు జరిగేవరకు, జరిగిన తర్వాత కూడా ప్రజలంతా సహకరించి, సమన్వయం పాటించి ఏ విధమైన గొడవలకు వెళ్ళరాదని శాంతియుతంగా ఉండాలని కోరుచున్నామనీ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం, వెనుక నుండి రెచ్చగొట్టే పనులు చేసిన కవ్వింపు చర్యలకు పాల్పడిన తీవ్రమైన పరిణామాలు ఉంటా యని ఎస్ఐ జి.రామకృష్ణ హెచ్చరించారు.

ఓట్ల లెక్కింపులో గందరగోళం సృష్టిస్తే చర్యలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ, ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 4వ తేదీన కృష్ణా విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎవరైనా సరే గందరగోళం సృష్టిస్తే తక్షణమే బయటకు పంపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా పోలీస్ అధికారి అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో రిటర్నింగ్ అధికారులు, డిఎస్పీలతో ఓట్ల లెక్కింపు, శాంతి భద్రతల పర్యవేక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా సజావుగా నిర్వహిం చాలని ఎవరైనా సరే ఎంతటి వారైనా సరే కౌంటింగ్ హాల్లో ఎటువంటి ఇబ్బంది, ఉపద్రవాలు కలిగించిన ఎట్టి పరిస్థితులలో వారిని ఉపేక్షించకుండా అక్కడి నుండి బయటకు తక్షణమే పంపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు .కౌంటింగ్ హాల్లోకి ఎట్టి పరిస్థితులలో సెల్ ఫోన్లు అనుమతించకుండా సరైన పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు తావు లేకుండా కఠినంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా లూజ్ పెట్రోలు, డీజిల్, బాణాసంచా విక్రయించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పార్టీ కార్యాలయాలు, పోటీ చేస్తున్న అభ్యర్థుల నివాసాలు వారి అనుచరుల ప్రముఖుల నివాసాల వద్ద ఇతర చోట్ల విజయోత్సవాలు, ఊరేగింపులు నిర్వహించకుండా కట్టుదిట్టమైన గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈనెల 3,4 తేదీలు చాలా క్లిష్టమైన రోజులని శాంతి భద్రతలను కాపాడుటకు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు .కౌంటింగ్ హాల్లో ఏ మూల ఏ సంఘటన జరిగినా నమోదయ్యే విధంగా సీసీటీవీలను అమర్చాలన్నారు. ఎస్‌పి నయీం అద్నామ్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైన తక్షణమే స్పందించి నియంత్రించాలని సూచించారు. ఈనెల 3 వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి 5వ తేదీ ఉదయం 9 గంటల వరకు సెక్షన్ 144, సెక్షన్ 30 అమలులో ఉంటాయని వాటిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద గాని ఇతర ప్రదేశాల వద్ద గాని ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా శాంతి భద్రతలను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గన్నవరం రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, డిఆర్‌ఓ కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పెనమలూరు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎం వాణి, పి వెంకటరమణ, జి బాలసుబ్రమణ్యం, డి రాజు, పి పద్మావతి, శ్రీదేవి డిఎస్పీలు సుభాని, నాగరాజు, రమేష్ బాబు, శ్రీకాంత్, జయ సూర్య, మురళీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు .



పెన్షన్ అందలేదని కార్పొరేటర్ సత్యబాబు వద్ద వాపోతున్న వృద్ధుడు

పెన్షన్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-వన్‌టౌన్ : పెన్షన్లు అందరికీ అందేవిధంగా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పెన్షన్ దారులు తమకు పెన్షన్ అందడం లేదని, బ్యాంకులకు, సచివాలయాలకి తిరిగిన వేలుముద్ర పడడం లేదని గత నెల అందలేదని, ఈనెల ఇవ్వలేదని ధన్రాజు అను వద్ధుడు కార్పొరేటర్ సత్యబాబు వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. బ్యాంకు ప్రైవేట్ సర్వీస్ కేంద్రాల్లో పెన్షన్ దారుల వద్ద పెన్షన్ ఇచ్చేందుకు రూ. 30 లు చొప్పున సర్వీస్ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని కార్పొరేటర్ బి సత్యబాబు ఈ సందర్భంగా తెలిపారు. సచివాలయం సెక్రటరీల ద్వారా ఇంటింటికి ఇచ్చే అవకాశాలు ఉన్న ఆ విధంగా పెన్షన్లు పంపిణీ చేయకుండా వయోవద్ధులు, వికలాంగులు, వితంతువులను బ్యాంకుల చుట్టూ తిప్పడం అన్యాయమని అన్నారు. ఒక నెల పెన్షన్ పొందకపోతే మరో నెల పెన్షన్ కలిపి ఇవ్వకుండా మిగిల్చుకోవడం పెన్షన్ దారుల హక్కుల్ని హరించి వేయడమేనని, వారి జీవనాధారం అయిన పెన్షన్లు ప్రభుత్వం స్వాహా చేయడమేనని తెలిపారు. ఒకటి రెండు నెలలు పెన్షన్ పొందని వారికి మొత్తం కలిపి ఇచ్చే విధంగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు.. ఈ సమస్యలపై ఈ సిడి ప్రాజెక్టు ఆఫీసర్‌కి సచివాలయం, సెక్రటరీలకు ఫిర్యాదులు చేయడం జరిగిందని సత్యబాబు తెలిపారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి. చల్లపల్లి : స్థానిక ఎస్ఆర్‌వై ఎస్‌పి ఉన్నత పాఠశాల పదవ తరగతి చదువుకున్న 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మేకావారిపాలెంలోని ఆర్కే కన్వెన్షన్లో ఆదివారం సందడిగా జరిగింది. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తమ జీవిత విశేషాలను, పాఠశాలలో నాటి అనుభవాలను పంచుకుని సంతోషంగా గడిపారు. గురువులు రాయపాటి ప్రసాదరావు, డి.జవహర్, ప్రభాకరరావు, విజయలక్ష్మి, నాగరాజకుమారి, సీతారామస్వామి, లీలావతిలను సత్కరించారు. చల్లపల్లి పరిసర ప్రాంతాలతో పాటు దూర ప్రాంతాలైన హైదరాబాద్, వరంగల్, చెన్నయ్, నాగపూర్, బెంగుళూరు, ఒరిస్సాల నుంచీ వచ్చిన సుమారు 70 మంది పూర్వవిద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు మోర్ల రాంబాబు, బీడీఆర్, అనుముకొండ వెంకట రమణ, పరిశె యుగంధర్, చెట్టుపల్లి కష్ణారావు, ఆకుల సుబ్బారావు, చల్లపల్లి వాసుదేవరావులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, డాక్టర్ మాలెంపాటి శారద, డాక్టర్ వేణు, చుండూరు మెహర్ ప్రభాకరరావు, రాజులపాటి శివప్రసాద్ పాల్గొన్నారు.

'గొయ్యి తీశారు.... పూడ్చడం మరిచారు'

ప్రజాశక్తి-గన్నవరం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గం కేంద్రంగా ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో ఓటింగ్ యంత్రాలను భద్రపరి చేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. దానికి అనుబం దంగా పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఓటింగ్ యంత్రాల పంపిణికి సంబంధించి బస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవిన్యూ శాఖ వారు చాలా ఉత్సాహం చూపించి క్రీడా ప్రాంగణంలో పోలింగ్ సిబ్బంది కి అనువుగా తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేశారు. అందుకు విశాలమైన క్రీడా మైదానంలో



గొయ్యి తవ్వి పూడ్చకుండా వదిలివేసిన దృశ్యం

గోతులు తీశారు. కాని రోజులు గడుస్తున్నా... రెవిన్యూ శాఖ వారు ఆవైపే చూడడం లేదు. దానితో ఈ క్రీడా మైదానంలో నిత్యం షుమారుగా 500 మంది వాకర్స్, క్రీడాకారులు వాకింగ్ చేస్తున్నారు. ఇలా వదలివేసిన మరుగుదొడ్డి దుర్వాసనకు తీవ్రమైన ఇబ్బంది పడుతున్నా రెవిన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిచి క్రీడాప్రాంగణం లోని మరుగుదొడ్లు గోతులను పూడ్చాలని మహిళా వాకర్స్ కోరుతున్నారు.

బెట్టింగ్ భూతం... ఆడితే ఖతం...



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం అసెంబ్లీ స్థానాలతో పాటు, బందర్ లోక్‌సభ స్థానాలపై రూ.కోట్లలో పందేలు నడుస్తున్నాయి. కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తున్న కొద్దీ ఇవి పెరుగుతున్నాయి. కాగా గన్నవరంలో ఒకే పార్టీకి చెందిన నాయకులు అదే అభ్యర్థి విజయావకాశాలపై రూ.1.20 కోట్లకు బెట్టింగ్ కాయడం గమనార్హం. గతంలో రాష్ట్ర స్థాయిలో పలుకుబడి ఉండీ, పెద్ద గుత్తేదారు సంస్థ నిర్వహించిన ఓ ప్రజాప్రతినిధి పందేల్లో పెద్ద ఎత్తున పోగొట్టుకున్నారు. బెట్టింగ్ మాయల్లో ఎక్కువగా ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాగా సంపాదించిన వ్యక్తులే ఉండటం గమనార్హం. కాగా సదరు నేతలు అటు ప్రజా ప్రతినిధులుగా, ఇటు అక్రమ సంపాదన ద్వారా రూ.కోట్లకు పడగలెత్తి పందేల్లో ముందుంటున్నారు. వీరంతా జట్టుగా మారి పెద్దఎత్తు బెట్టింగుల్లో పాల్గొంటున్నారు. ఆ స్థానాలపై రూ.కోట్లకు కోట్లు జనరల్ స్థానంలో పోటాపోటీగా ఎన్నికలు జరిగిన నియోజకవర్గం పై కొందరు స్థిరాస్తి వ్యాపారులు పందేలు కాశారు. గన్నవరంలోని పేరొందిన స్థిరాస్తి వ్యాపారి రాష్ట్రంలో ఓ పార్టీ గెలుస్తోందని రూ.5 కోట్లకు పందెం పెట్టారు. సదరు వ్యక్తితో పందెం కాసిన వ్యక్తి స్థిరాస్తి వ్యాపారే కాగా బెంగళూరుకు చెందిన వారు కావడం గమనార్హం. ఇలా హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల్లోని బుకీలు ఇందులో ఉంటున్నారు. ఎక్కువగా పందేలు సాగినట్లు సమాచారం. రూ.15 కోట్ల పైచిలుకు పందేలు కాసినట్లు తెలిసింది.

జిల్లాలోని అభ్యర్థుల గెలుపోటములపై జిల్లాకు చెందిన వ్యాపారులు పందేల్లో దిగారు. వీరంతా ఇక్కడి మధ్యవర్తుల ద్వారా నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థులపై పందేలు కాశారు. గత నెల 13 నుంచే పందేల్లో దిగడంతో నియోజకవర్గాల్లో రూ.50 కోట్ల మేర అక్కడి వారు పందెం కాసినట్లు సమాచారం. మధ్యవర్తులుగా ఉన్న వారిలో అత్యధికులు వైకాపా నేతలు కావడం గమనార్హం.

యువతను గుల్ల చేస్తూ.. : ఐపిఎల్ క్రికెట్ సీజన్ పూర్తి కావడంతో పందేల ముఠాలం రాజకీయాల వైపు మారిపోయారు. యువతను ఇందులో దింపేశారు. రూ.లక్షల్లో బెట్టింగ్ పెట్టించే యత్నాలు చేసి వారిని గుల్లచేస్తున్నారు. సాఫ్ట్వేర్ ఉద్యోగులు సైతం ఈ ఊబిలోకి దిగడం గమనార్హం. నియోజకవర్గాల్లోని కొందరు ఉద్యోగులు పాల్గొనడం చర్చనీయాంశమైంది. మరి కొందరు ఆస్తులు తనఖాకు సిద్ధమైనట్లు సమాచారం. ఇంకొందరు ప్రామిసరీ నోట్లు రాయించుకుంటున్న దుస్థితి నెలకొంది.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సంసిద్ధమవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచించారు. కష్ణా యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నికలు 2024 ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఆదివారం నగరంలో నియోజకవర్గాల వారీగా వివిధ ప్రదేశాలలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి సమస్య తలెత్తినా గందరగోళానికి గురికావద్దని, సమస్యను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దష్టికి తీసుకువెళ్లాలన్నారు.పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని, చెల్లిన, చెల్లని బ్యాలెట్ ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కింపు చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లేదా ఈవీఎం ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల కోరిక మేరకు బ్యాలెట్లు, పోలైన ఓట్లను మరో మారు వారికి చూపించాలన్నారు. అభ్యర్థులకు పోలైన ఓట్లను సంబంధిత పత్రాలలో నమోదు చేసే సమయంలో అంకెల సారూప్యతను దృష్టిలో పెట్టుకుని గందరగోళం లేకుండా ఉండేందుకు అంకెలను స్పష్టంగా పేర్కొనాలని, తద్వారా కంప్యూటర్లో నమోదు చేసే సిబ్బందికి అంకెల పట్ల స్పష్టత ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులలో జాయింట్ కలెక్టర్ గన్నవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పి పద్మావతి, వెంకట రమణ, ఎం వాణి, సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, డి రాజు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రభుత్వంలో నాల్గో తరగతి ఉద్యోగులది కీలకపాత్ర

ప్రజాశక్తి - విజయ వాడ అర్బన్ :

రాష్ట్ర ప్రభుత్వం లోని వివిధ విభా గాల్లో సేవ లం దిస్తు న్న నాలుగో తరగతి ఉద్యోగులది కీలకపాత్రని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందనే నమ్మకాన్ని నాలుగో తరగతి ఉద్యోగుల్లో కల్పించేలా సంఘం రాష్ట్ర నాయకులు కృషి చేయాలని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి అన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం గాంధీ నగర్‌లోని ఎన్జీజీవో హోంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంతవరకు వేగవంతమైన పరిష్కారం కోసం ప్రయత్నిస్తామన్నారు. నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్ర శాఖలో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన బివి రమణారెడ్డి, కోశాధికారిగా వ్యవహరించిన ఎస్. కాశయ్య పదవి విరమణ చేసిన సందర్భంగా వారి స్థానంలో ప్రధాన కార్యదర్శిగా రామనారాయణ, మాణిక్యాలరావు కోశాధికారిగా నియమించినట్లు చెప్పారు. వీరితో పాటు జి. శ్రీనివాసరావు కార్యదర్శిగా కొనసాగుతారన్నారు. పదవి విరమణ చేసిన నాయకులకు కె.వి.శివారెడ్డి చేతుల మీదుగా నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గం ఆత్మీయ సత్కారం నిర్వహించింది. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.ఎస్. సాయిరాం, ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులతో సహా పలువురు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాండ్ల ద్వారా ఐఐఎఫ్‌ఎల్ నిధుల సేకరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :

ఐఐఎఫ్‌ఎల్ సమస్త ఫైనాన్స్, అనేది అతి పెద్ద నాన్ బ్యాంకింగ్ మైక్రో ఫైనాన్స్ సంస్థ (ఎన్బిఎఫ్సి-ఎంఎఫ్ఐ), ఇది సురక్షితమైన బాండ్స్ సామాజిక జారీ ద్వారా వెయ్యి కోట్లు సేకరించనుందని ఐఐఎఫ్‌ఎల్ సమస్త ఫినాన్స్ ఎండీ, సీఈవో వెంకటేష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూలధన వృద్ధి, వ్యాపార ఎదుగుదల కోసం ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బాండ్స్ 10.50 శాతం ఆఫర్ చేస్తున్నాయన్నారు. అధిక సంరక్షణ అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ జారీ సోమవారం, జూన్ 3, 2024న మొదలవుతుందని 14 జూన్ 2024 శుక్రవారం ముగుస్తుందని తెలిపారు. 60 నెలల కాలవ్యవధికి సంవత్సరానికి 10.50 శాతం అత్యధిక కూపన్ రేటును అందిస్తాయన్నారు. ఎన్సీడీ 24 నెలలు, 36 నెలలు, 60 నెలల కాల వ్యవధిలో అందుబాటులో ఉంటుందన్నారు. వడ్డీ చెల్లింపు ఫ్రీక్వెన్సీ ప్రతి సిరీస్‌కు నెలవారీ, వార్షిక ప్రాతిపదికన అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కోళ్ల ఫారాలకు ఎండదెబ్బ



ప్రజాశక్తి - వత్సవాయి : ఎండ ప్రభావం వ్యాపారులకు సవాల్‌గా మారింది. ఒకవైపు కూరగాయల ధరలు మండిపోతుంటే మరోవైపు చికెన్ ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి, ఆదివారం మాంసం తినాలనుకునే సగటు మనిషి మార్కెట్లో కోడి మాంసం ధరలు చూసి ఒక్కసారిగా హడలిపోతున్నాడు. యజమానులు మాత్రం మార్కెట్ రేటు ప్రకారం అమ్మకాలు జరపటం తప్ప మా చేతిలో ఏమీ లేదని చికెన్ షాప్ నిర్వాహకులు దారెల్లి నాగేశ్వరరావు తెలుపుతున్నారు.

కేజీ చికెన్ 260 రూపాయలు

ప్రస్తుతం కోడి మాంసం కేజీ ధర 260 ధర పలుకుతుంది జనవరి ఫిబ్రవరి మాసాల్లో రూ.150 ల నుండి రూ.180లకు కోడి మాంసం ధర ఉంది. ఒకేసారి రెండు వందల రూపాయలకు పెరిగింది. మే నెలలో ఉండాల్సిన ఎండలు ఏప్రిల్ నెలలోనే ఎండ తీవ్రత వలన కోళ్ళు అధిక సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి దీనివల్లే ఒక్కసారిగా రేట్లు పెంచాల్సి వస్తుందని వత్సవాయి జగ్గయ్యపేట మార్కెట్ వర్గాలు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితి మరో నెల రోజులు పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.



చికెన్ దుకాణం

సవాల్‌గా మారిన పెంపకం

మండలంలోని మక్కపేట, ఖంభంపాడు, భీమవరం చిల్లకల్లు, కన్నివేడు తదితర గ్రామాల్లో కోళ్ల పెంపకాల ఫారాలు ఉన్నాయి. పిల్లల కోడిగా ఎదగాలంటే 45 రోజుల సమయం పడుతుంది ఈ సమయాల్లో వ్యాధుల బారిన పడకుండా కాపాడుకుంటారు. ఖర్చులన్నీ కలుపుకుంటే కోడి పిల్ల కోడిగా మారేంతవరకు 90 రూపాయల నుండి 100 రూపాయల వరకు పౌల్ట్రీ యజమానికి ఖర్చవుతుంది తమ కుటుంబ సభ్యుల శ్రమ పౌల్ట్రీలో పనిచేసే వారికి ఇచ్చే జీతాలు కలుపుకుంటే మరో రూ.50లు అదనంగా కలుపు కోవలసి ఉంటుంది. మే నెలలో పడుకోవటమే సవాలుగా మారిందని కోళ్ల ఫారం యజమానులు చెబుతున్నారు. ఈ కాలంలోనే శ్వాస సంబంధిత వ్యాధులు వస్తాయని ఆందోళన వెళ్లబుచ్చుతున్నారు. కలం, కొక్కెర, గంబోలా, వ్యాధులు ప్రస్తుతం కోళ్లను కబళిస్తున్నాయి. దీనివల్ల మార్కెట్లో కోడి మాంసం ధర పెరగటానికి అవకాశం ఉందని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు.

పెరిగిన మటన్ రేట్లు....

చికెన్ ధరలు ఎలా ఉంటే మటన్ ధరలు కూడా ఆకాశాన్ని వండుతున్న మటన్‌లో ఎనిమిది వందల రూపాయలు ఉండగా ఆదివారం మాత్రం రూ.1000ల వరకు అమ్ముతున్నారు. నిన్నటి వరకు రూ.800లు ఉండగా ఆదివారం వెయ్యి రూపాయలు వరకు ధర పలుకుతుంది. మాంసం తినాలంటే మాంసాహార ప్రియులు వెనకాడుతున్నారు.

ఎండ తీవ్రత ప్రధాన కారణం

వేసవిలో ఎండలు పౌల్ట్రీ ఫారాలపై వర ప్రభావం పడుతున్నాయి. ఎండ వేడి మీద తట్టుకోలేక కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో కోళ్ల ఫారాలు యజమానులు పగటి ఉష్ణోగ్రతలు ఏప్రిల్ నెలలోనే 35 డిగ్రీల నుండి డిగ్రీ వరకు సారటంతో ఆ పరిస్థితి నెలకొంది. సహజంగా మేలో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయింది. ఢిల్లీలో 52 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది కోళ్ల ఫారం నిర్వాహకులు ఎంత జాగ్రత్తలు తీసుకున్న భానుడి ప్రభావంతో మలమల మాడిపోతున్నాయి.

కాపాడుకోవడానికి తగు చర్యలు

కాపాడుకోవడానికి పౌల్ట్రీ పారాల చుట్టూ గోనె పట్టాలు కట్టుకోవాలి. సెగ తగలకుండా రేకుల పైన వరిగడ్డితో పాటు గోనె పట్టాలు వేసి రోజుకి నాలుగు నుంచి ఐదుసార్లు తడపాలి. తడీ ఆరకుండా చూసుకోవాలి. షెల్టర్‌ల ద్వారా కోళ్లపై నీళ్లు చల్లాలి. ఫ్యాను గాలి లేదా కూలర్ల ద్వారా చల్లటి గాలి వచ్చేలా చేయాలి. రోజూ కోళ్లను గమనించి ఏ మాత్రం తేడా వచ్చినా సంబంధిత డాక్టర్ని సంప్రదించి మందులు వాడాలని నిపుణులు చెబుతున్నారు.

అందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్యం

పెరినటాలజీ, రీప్రొడక్టివ్ మెడిసిన్ సీఎంఈలో వక్తలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అత్యాధునిక వైద్య సేవలను ప్రజలందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ గాజుల రమేష్ అన్నారు. పెరినటాలజీ, రీప్రొడక్టివ్ మెడిసిన్ సీఎంఈ ద్వారా, ఆయా విభాగాలకు సంబంధించిన ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చక్కటి అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, విజయవాడ ఆబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ సౌజన్యంతో అను మై బేబీ వైద్య సదస్సు ముగింపు కార్యక్రమం నగరంలోని హోటల్ మురళీ ఫార్చ్యూన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ ప్రసంగిస్తూ అత్యంత క్లిష్టమైన ప్రసూతి కేసులు, పునరుత్పత్తి ఔషధ విభాగంలో అనేక విప్లవాత్మక ఆవిష్కరణలు వెలుగు చూశాయన్నారు. నూతన ఆవిష్కరణల సహాయంతో మెరుగైన ఫలితాలను సాధించొచ్చని తెలిపారు. ఆధునిక ఔషధాల వినియోగం ద్వారా పునరుత్పత్తికి సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన ప్రసూతి కేసులు, పునరుత్పత్తి ఔషధాలకు సంబంధించి వివిధ అంశాలపై ఈ సీఎంఈలో విస్తృతంగా చర్చించినట్లు డాక్టర్ గాజుల రమేష్ తెలిపారు. రెండు రోజుల సదస్సులో వివిధ అంశాలపై పలువురు నిపుణులు ప్రసంగించారు. ఆయా అంశాలకు సంబంధించిన ఆధునిక విజ్ఞానాన్ని పరస్పరం పంచుకుంటూ, ప్రశ్నోత్తరాల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సదస్సులో భాగంగా పలు కీలక అంశాలపై అను మై బేబీ హాస్పిటల్‌లో వర్క్‌షాపులు నిర్వహించారు. ఈ సీఎంఈకి చీఫ్ ప్యాట్రన్స్‌గా డాక్టర్ గాజుల రమేష్, డాక్టర్ జి.శ్రీదేవి వ్యవహరించగా, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ చలసాని, సెక్రటరీ డాక్టర్ శివరాం అక్కినేని, వీవోజీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, సెక్రటరీ డాక్టర్ వెల్లంకి సుజాతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సైంటిఫిక్ కమిటీ సభ్యులుగా డాక్టర్ తీగల రమేష్, డాక్టర్ కె.ఎన్. శ్వేత, డాక్టర్ కవిత బత్తుల, డాక్టర్ గురు ప్రసాద్ పేరూరి, డాక్టర్ ఎస్. కిరణ్ కుమార్ వ్యవహరించారు. డాక్టర్ కె.వి.రవికుమార్, డాక్టర్ కె. దుర్గా నాగరాజు, డాక్టర్ పి. విశ్వేశ్వరరావు సీఎంఈ ఆర్గనైజింగ్ సెక్రటరీల హోదాలో సదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేశారు.



రెండో మ్యాచ్‌లోనూ సెంచరీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

గుంటూరు జిల్లా పేరేచేర్ల క్రికెట్ గ్రౌండ్‌లో కృష్ణ జట్టు గుంటూరు జట్టు తలపడగ కృష్ణా జట్టు 17 పరుగుల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ టి.వరుణ్ సాత్విక్ 133 బాల్స్ ఆడి 145 రన్స్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. ఇందులో 17 ఫోర్స్, 8 సిక్స్ ఉన్నాయి. ఎన్.భాను వరప్రసాద్ 60 బాల్స్ ఆడి 33 రన్స్ ఇద్దరి భాగస్వామ్యం 155 రన్స్ జట్టు విజయానికి అందించింది. బౌలింగ్ లో ఎన్. రాజేష్ 30 పరుగులకి 3 వికెట్లు తీసుకున్నాడు.